# 'ఓసి సీతా, నువ్వేటే....!

కాజ జగన్మోహనరావు

★

సాయంకాలము ఆఫీసునుంచి ఇంటికి రాగానే కొత్త మొహము సబ్బుతో తోమి, తెల్లని పంచ, చొక్కా కట్టుకొని బయలుదేరా.

యల్లుండికిగాని జీతమురాదు. ఊరు కొత్తవడంచేత ఏ హోటలువాడు అప్పివ్వడు. భోజనమువాడయితే ముందరే ఎడ్వాన్సు పుచ్చుకొన్నాడు కాబట్టి భోజనానికేమి ఇబ్బంది లేదు. మరి కాఫీహోటలులో ఫలహారము చేయడము ఎట్లా ? ఆకలివేస్తోంది. పోనీ ఆఫీసులో ఎవరినయినా అప్పడుగుదామా అనుకొంటే కొత్తవాణ్ణవడంచేత ఏమనుకుంటారో !

సరే 5 గంటలయిందికదా. ఇహ రెండు గంటలలో భోజనము చేయవచ్చు. ఈలోపల ఈ మనోవేదన ఎందుకు అని అనుకొని పార్కులోనయిన కూర్చుందామని బయలుదేరా, బయట దుస్తులు శుభ్రముగానే ఉన్నాయికాని లోపలి పొట్ట ఏడుపు ఎవరికి తెలుస్తుంది ?

నడవలేక, నడవలేక నీరసంతో ఈ జీవచ్ఛవాన్ని రోడ్డుమీద ఎలాగో అలాగు నడిపిస్తున్నా. ఇంతలో ఒక మేడమీదనుండి ఒక అమ్మాయి "ఏమండోయి, ఏమండోయి" అని కేకలు వేసింది. నేను తిరిగాను కాని ఆ కేకలు నన్ను కాదనుకొని నడవడము ప్రారంభించా.

మళ్ళీ కేక వినబడింది. అప్పుడు నన్నేనని తెలుసుకొని వెనక్కి తిరిగా. 'మీతో కొంచము పనివుంది. పైకి వస్తారా ?' అన్నది నవ్వుతూ.

కొత్తమ్మాయి పిలుస్తోంది. వెళ్ళాలా వెళ్ళకూడదా. ఆ అమ్మాయిని చూస్తే ఆడోమోస్తరు అనిపించింది. ఉత్సాహంగా మెట్లవరకు వెళ్ళా. పైకి రమ్మన్నది. మెట్లు ఎక్కడము ప్రారంభించా. సహం ఎక్కేటప్పటికి మనము ఆ అమ్మాయిని ఎప్పుడయినా ఏమన్నా అనలేదు కదా. ఆ అమ్మాయికి తప్పేమీ చేయలేదుకదా. తీరా మనం వెళ్ళేటప్పటికి వాళ్లవాళ్ళచేత వీపుమీద భజన చేయించదుకదా' అని అనుకొన్నా. వెంటనే ఈ ఆలోచన షాక్ తగిలినట్లు తగలడంచేత భయంపుట్టి కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి.

సరే 'భయం పురుషలక్షణం కాదు' అనుకొని లోపల భయమువేస్తూన్నప్పటికి కాళ్ళు బిగబట్టి ఒక్కొక్క మెట్టు ఎక్కి చివరకు మేడమీద చేరుకున్నా.

ఆ అమ్మాయి ఎదురువచ్చి 'లోపలికి రండి' అని ఒక గది చూపించింది. కొత్తమేళం. భయం, భయంతోపాటు బిడియపుమోజుకూడ ఎక్కువవుతోంది. ఏం చేయాలె ? అని ఆలోచిస్తూ తడబడుతున్నా. 'మిమ్మన్నేనండి లోపలికి రమ్మన్నది' అని అధికంగా నవ్వుతూ అన్నది.

కొద్దిగా రోషముకూడా వచ్చి కాళ్ళు వణుకుతున్నప్పటికినీ, నిజంగా ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తోందేమో అనుకొని వెళ్ళా గదిలోకి,

ఒక పీటవేసి కూర్చోమంటూ 'మీరు బ్రాహ్మణులే కాదండీ' అని అన్నది బాగా నవ్వుతూ. 'సరే' అన్నా ఆశ్చర్యంతో. సరే పీటమీద ఆసీనుడనయినా. పక్కన మంచినీళ్ల గ్లాసు పెట్టి, ఒక విస్తరిలో నాలుగు గారెలు పెట్టి నా ముందర ఆ విస్తరి పెట్టి ఫలహారము చేయమన్నది. కొత్తింట్లోకి వచ్చి యిదేమిపవి అనుకొని లోపల ఆకలి వేస్తూన్నప్పటికిని 'నేను తినను. నేనిప్పుడే కాఫీ హోటలుకి వెళ్ళి వస్తున్నా' అని అంటూ లేవపోయినా. మీరు తింటేనేగాని ఇక్కడనుంచి కదలడానికి వీల్లేదు' అని అంటూ తలుపుకి అడ్డంగా నుంచున్నది.

సరే ఇహ బాగుండదనుకొని విస్తరి ముందరికి లాగి కాసేపు ఆగి 'ఇన్ని తినలేను' అన్నా. 'ఫరవాలేదు తినవచ్చు' అన్నది నవ్వుతూ. లోపల ఆకలిగానే ఉన్నది. ఈ నాలుగే కాదు. ఇంకో అన్ని తినగలను. ఒకవేళ తింటే నన్ను మోటవాడు అనుకుంటుందేమోనని 'నేను తినను. నన్ను దయవుంచి బలవంతముపెట్టవద్దు. రెండు తియ్యండి' అన్నా. 'మీరు విస్తరి ముట్టుకొన్నారు. నేను మడి గట్టుకున్నాను. ఎట్లా ముట్టుకుంటా వాటిని నేను, తినండి' అన్నది. ఇంకా నవ్వుతూ, ఎందుకో ఆ నవ్వు. నా కర్థంకావడం లేదు. పోన్లే తియ్యనందుకు లోపల సంతోషపడుతున్నా. కాని ఇంకా తినడము ప్రారంభించ లేదు.

'తినరా, నా దగ్గరకూడ బెట్టుసరి ఎందుకు. నేను నందికేశుల నోము నోచుకొన్నాను, ఎట్లాగో అట్లాకు చెల్లించు. అట్లా చూస్తావే నావంక మొద్దల్లే. ఇంకా నన్ను గుర్తించలేదుటరా' అన్నది.

'రా' అంటుంది. ఎవరు ఈ అమ్మాయి. ఎప్పుడూ చూడలేదే అనుకున్నా. 'రా' అన్నందుకు కోపంవచ్చి గంభీరంగా ఆ అమ్మాయివంక చూచి ఆశ్చర్యపోయి 'ఓసి సీతా! నువ్వటే. పెద్దయినతరువాత చూడనేలేదు. మీ ఆయనకు ఈ ఊళ్లోనా ఏమిటి పని?' అని అంటూ సంతోషంతో ఒక గారెను తుంచా. ఆ నాలుగే కాకుండా ఇంకో అరడజనుకూడా!....

